నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | బుధవారం 10-2-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 163 | పేజీలు: 4 | వెల: రూ.1/-

రాజ్యసభలో భావోద్వేగానికి గురైన ప్రధాని మోడీ

గులాం నబీ ఆజాద్ సేవలను కొనియాడిన ప్రధాని
కాశ్మీర్ సిఎంగా చేసిన సేవలను జ్ఞప్తికి చేసిన మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): ప్రధాని మోదీ రాజ్యసభలో భావోద్వేగానికి గురయ్యారు. పదవీకాలం ముగిస్తున్న నేతలను ఉద్దేశిస్తూ ఆయన కాసేపు మాట్లాడారు. కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ కూడా రాజ్యసభ పదవీకాలం ముగియనున్నది. ఆజాద్ రిటైర్మెంట్ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. గులాం నబీ నిజమైన స్నేహితుడని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ సీఎంగా ఆజాద్ ఉన్న సమయంలో ఆయన చేసిన మేలును మరిచిపోనని మోదీ గుర్తు చేశారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి జరిగినప్పుడు.. అక్కడ గుజరాతీ పర్యాటకులు చిక్కుకున్నారని, ఆ సమయంలో తాను ఆజాద్ వద్ద సాయం కోరానని, అప్పుడు గులాం నబీ.. తనకు అనుక్షణం వారి గురించి అప్‌డేట్ ఇచ్చారని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. గుజరాతీ పర్యాటకులను ఆజాద్ రక్షించినట్లు పేర్కొన్న మోదీ కొన్ని క్షణాల పాటు దుఖ్ఖాన్ని ఆపుకునే ప్రయత్నించారు. స్వంత కుటుంబీకుల కోసం తాపత్రయం పడిన రీతిలో స్పందించారన్నారు. ఆజాద్ చేసిన సహాయాన్ని గుర్తుచేస్తూ.. ఆయనకు సెల్యూట్ చేశారు. ఉన్నత పదవులు వస్తుంటాయి, పోతుంటాయని, కానీ గులాం నబీ నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. గులాం నబీ తనకు చాన్నాళ్ల నుంచి తెలుసు అని, ఒకే సారి సీఎంలుగా పనిచేశామని, గార్డెనింగ్‌లో ఆయనకు మంచి పట్టు ఉందన్నారు. దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతోనూ తనకు మంచి సంబంధాలు ఉన్నాయని మోదీ గుర్తు చేశారు.

ఆజాద్‌కు వీడ్కోలు పలుకుతూ భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ నేతతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఉద్యోగాలు, పదవులు, అధికారాలు వస్తాయి.. పోతాయి.. కానీ వాటిని ఎలా నిర్వహించాలో గులాం నబీ ఆజాద్‌ను చూసి నేర్చుకోవాలన్నారు. జమ్మూకశ్మీర్‌లో గుజరాతీ యాత్రికులపై ఉగ్రదాడి జరిగినప్పుడు నాకు ముందు ఫోన్ చేసింది ఆజాదే. ఆ రాత్రి నాకు ఫోన్ చేసి దాడి గురించి చెబుతూ ఆయన కన్నీటిపర్యంతమయ్యారు. అప్పుడు ప్రణబ్ ముఖర్జీ రక్షణమంత్రిగా ఉన్నారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన యాత్రికుల మృతదేహాలను గుజరాత్‌కు తరలించాలని ప్రణబ్‌దా భారత వాయుసేనను కోరారు. ఆ తర్వాత ఆజాద్ మళ్లీ ఫోన్ చేసి నేను ఎయిర్‌పోర్టులో ఉన్నానని చెప్పారు. ఆయన నాకు నిజమైన స్నేహితుడు. ప్రతి ఒక్కరినీ ఆయన తన కుటుంబసభ్యుల్లాగే చూసుకుంటారని మోదీ కన్నీళ్లతో చెప్పుకొచ్చారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఆయన స్థానాన్ని భర్తీ చేసే నేత లేరని కొనియాడారు. కేవలం పార్టీ కోసమే గాక, సభ.. దేశం కోసం ఆందోళన చెందే వ్యక్తి ఆజాద్ అని ప్రశంసలు కురిపించారు. ఆయనను ఎప్పటికీ రిటైర్ అవనివ్వబోనని, ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటామని మోదీ తెలిపారు. ఆజాద్‌తో పాటు పలువురు రాజ్యసభ సభ్యులు నేడు పదవీ విరమణ పొందుతున్నారు.

కాగా.. గులాం నబీ ఆజాద్‌పై మోదీ సోమవారం కూడా ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్‌లో బ్లాక్, జిల్లా అభివృద్ధి మండళ్ల ఎన్నికలను బాగా నిర్వహించాని ఆజాద్ జీ మెచ్చు కున్నారు. ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకత్వం సరిగానే అర్థం చేసుకుంటుందని భావిస్తున్నా. అలా కాకుండా.. జీ 23 ఇచ్చిన సూచన మాదిరి ఆయన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుంటారేమో నన్నదే నా అనుమానం అని ప్రధాని రాజ్యసభలో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకత్వాన్ని మార్చాలని, పార్టీ అంతర్గత ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ.. ఆజాద్ సహా 23 మంది పార్టీ సీనియర్ నేతలు అధ్యక్షురాలు సోనియాగాంధీకి లేఖ రాయడం దుమారం రేపిన సంగతి తెలిసిందే.

కోవిడ్ సమయంలో కష్టపడ్డ పోలీసులు
తెలంగాణలో పటిష్టంగా శాంతిభద్రతలు: డీజిపి

హైదరాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): పోలీసులు గత సంవత్సర కాలంలో కోవిడ్ సమయంలో ఎంతో కష్టపడి ప్రజలకు సేవలందించారని డీజీపీ మహేందర్ రెడ్డి కొనియాడారు. స్పోర్ట్స్ కల్చర్ హ్యూమానిటీ డెవలప్ చేయడానికి కృషి చేస్తోందని తెలిపారు. టీం వర్క్ గా పని చేసి అందరిలో మంచి సౌభ్రాతృత్వంని పెంపొందిస్తాయని చెప్పారు. పోలీసులు చేసే ప్రతి పని టీమ్ వర్క్ ముఖ్యమన్నారు. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండాలంటే స్పోర్ట్స్ దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ఫిజికల్ ఫిట్నెస్ కోసం కొంత టైం కేటాయించాలని ఆయన సూచించారు. పోలీసులు తమ డ్యూటీ చేయాలంటే ఫిజికల్ ఫిట్నెస్ ముఖ్యమన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని పోలీసులు పాటించాలని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు డిపా÷-టం÷-మెంట్ నక్సెస్ అవుతుందన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. చట్టాన్ని వయలేట్ చేసేవారి పై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని నేరాలను అదుపు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో జిమ్‌ని ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎంపీ సీటు ఇవ్వలేదని జగన్‌పై షర్మిలకు కోపం : వీహెచ్

హైదరాబాద్ : ఎంపీ సీటు ఇవ్వలేదని అన్న జగన్‌పై షర్మిల కోపం పెంచుకుందని మాజీ పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీ హనుమంతరావు అన్నారు. అన్న మీద కోపంతో తెలంగాణలో షర్మిల పార్టీ పెడితే ఏం లాభమని ఆయన ప్రశ్నించారు. అన్నపై కోపం ఉంటే షర్మిల ఆంధ్రలో పార్టీ పెట్టుకోవాలని ఆయన సూచించారు. పార్టీలు పెట్టించడంలో బీజేపీ నాయకుడు అమిత్ షా దిట్ట అని అన్నారు. షర్మిల పార్టీలోకి కాంగ్రెస్‌కు చెందిన రెడ్డి సామాజిక వర్గం నేతలెవ్వరూ వెళ్లరనే భావిస్తున్నా. పోలవరం ప్రాజెక్టుపై షర్మిల ఏ సమాధానం చెబుతుందని వీహెచ్ నిలదీశారు.

షర్మిల పార్టీ ప్రకటనపై టిఆర్ఎస్‌లో చర్చ

సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున పోస్టులు

హైదరాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ వైఎస్ షర్మిల ఇవాళ లోటస్‌పాండ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కీలక ప్రకటన చేస్తారంటూ పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే పార్టీ పెడతారని కొందరు చెబుతుంటే.. పార్టీ పేరు ఇదేనంటూ ఇంకొందరు చెబుతున్నారు. ఈ క్రమంలో షర్మిల పార్టీపై టీఆర్ఎస్‌లో తీవ్ర చర్చ జరుగుతోంది. షర్మిలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో టీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పోస్టులు పెడుతున్నారు. అన్న (వైఎస్ జగన్ మోహన్ రెడ్డి) అన్యాయం చేస్తే ఆంధ్రాకు వెళ్లాలంటూ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు తెలంగాణలో ఏంచేస్తారని సెటైర్‌ల వర్షం కురిపిస్తున్నారు. ఉద్యమకాలంలో చెప్పుల దండలు వేసిన షర్మిల ప్లెక్సీలను ఇప్పుడు సోషల్ మీడియాలో టీఆర్ఎస్ నేతలు వైరల్ చేస్తున్నారు. తెలంగాణలో కొత్తపార్టీ అనే విషయం మీద కేసీ ఆర్ మొన్నటి సమావేశంలో మాట్లాడిన వ్యాఖ్యలను కొందరు గుర్తు చేస్తున్నారు. మొన్న కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ సీఎం మార్పు ఊహాగానా లకు కేసీఆర్ తెరదించారు. తాను ఆరోగ్యంగా ఉన్నానని.. మరో పదేళ్లు తానే ముఖ్యమంత్రినని స్పష్టం చేశారు. అంతేకాక సీఎం మార్పు గురించి ఎవరైనా మాట్లాడితే... కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఆ తరువాత ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త పార్టీ పెట్టడం అంత ఈజీ కాదని అన్నారు. పార్టీ అంటే పాటలు పాడటం.. పాన్ షాప్ పెట్టడం కాదంటూ ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అది షర్మిల పార్టీ గురించేనా అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొత్త పార్టీ ఏర్పాటు చేయాలంటే దానికి బలమైన నిర్మాణం కావాలని పార్టీ ముందుకెళ్లడానికి తగిన వ్యూహం కూడా ఉండాలన్నారు. అంతే కాక గత 20 ఏళ్లలో 14 పార్టీలు వచ్చిపోయిన సంగతిని కూడా కేసీఆర్ సమావేశంలో పేర్కొన్నారు. దేవేందర్‌గౌడ్, విజయశాంతి, చిరంజీవి, జయప్రకాశ్ నారాయణ, కోదండరాం లాంటి వాళ్లు పార్టీలు పెట్టినా.. వాటి ఆనవాళ్లు లేవన్నారు. చెన్నారెడ్డి లాంటి నేత తెలంగాణ ప్రజాసమితిని ఏర్పాటు చేసి 11 ఎంపీ స్థానాలు గెలిచినా.. ఇందిరాగాంధీ ధాటికి తట్టుకోలేకపోయారని గుర్తు చేశారు. ఇప్పుడు కేసీ ఆర్ వ్యాఖ్యలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

రైతుల ఆత్మగౌరవాన్ని పెంచిన సీఎం కేసీఆర్ : మంత్రి నిరంజన్ రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి9: రైతుల ఆత్మగౌరవాన్ని పెంచింది సీఎం కేసీఆర్ అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామంలో రైతు వేదికను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు , ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి, జడ్పీ చైర్మన్‌లు శ్రీ హర్షిని, గండ్ర జ్యోతిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు సీఎం కేసీఆర్ పెంచారన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు రైతులకు నష్టం చేసే విధంగా ఉన్నాయన్నారు. రైతుల సంక్షేమమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల్లో ఐక్యత కలిగించడమే రైతు వేదికల లక్ష్యమన్నారు. ప్రతిపక్షాలు ఆరోపణలు చేసే ముందు తగిన ఆధారాలతో మాట్లాడాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

రాజన్న రాజ్యం తెలంగాణలో ఉందా !

వైఎస్ ఉన్న రోజుల్లో తెలంగాణలో రైతులు రాజులా బ్రతికాడు
వైఎస్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది
పార్టీ పెడితే అందరికీ చెప్పే పెడతా
ముందుగా జిల్లాల వారీగా ఆత్మీయ సమావేశాలు
మనసులో మాట బయటపెట్టిన వైఎస్ తనయ షర్మిల

హైదరాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): రాజన్న రాజ్యం ఉందా..ఇప్పుడు ఇక్కడ లేదు...అంటూ షర్మిల ప్రసంగం సాగింది. అభిమానులకు అభిదాదం చేస్తున్న సందర్భంగా పలికిన తొలిపలుకులు ఇవి.

దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ వైఎస్ షర్మిల ఆత్మీయ సమ్మేళనాన్ని లోటస్‌పాండ్‌లో ప్రారంభించారు. అంతకుముందు ఆమె వేదికపైకి వచ్చి తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, అభిమానులకు అభివాదం చేశారు. షర్మిల తెలంగాణలో కొత్త పార్టీ పెట్టబోతున్నారంటూ ప్రచారాలు సాగిన నేపథ్యంలో ఆమె ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించడం విశేషం. తెలంగాణలో రాజన్నరాజ్యం లేదని, వైఎస్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందని షర్మిల పేర్కొన్నారు. వైఎస్ ఉన్న రోజుల్లో తెలంగాణలో రైతు రాజుల బ్రతికాడని, కానీ, రాజన్న మరణం తరువాత తెలంగాణలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజన్నరాజ్యం తనతోనే సాధ్యం అవుతుందని షర్మిల పేర్కొన్నారు. రాజన్నరాజ్యం తిరిగి సాధించేందుకే ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

తాను మాట్లాడటానికి రాలేదని, చెప్పింది వినేందుకే వచ్చానని నల్గొండ జిల్లా నేతల ఆత్మీయ సమావేశంలో పేర్కొన్నారు. మొత్తంగాతెలంగాణలోని వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు, అనుచరులతో వైఎస్ షర్మిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మొదట నల్గొండ జిల్లాకు చెందిన కీలక నేతలతో షర్మిల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలు, నేతలతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'రాజన్నను అభిమానించే ప్రతి గుండెకు.. రాజన్న బిడ్డ శిరస్సు వంచి, చేతులు జోడించి నమస్కారం తెలియజేస్తోంది' అని షర్మిల తన ప్రసంగాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ లేని లోటు తెలంగాణలో ఉందని.. రాష్ట్రంలో రాజన్న రాజ్యం రావాలన్నదే తన కోరిక అని షర్మిల తన మనసులోని మాటను బయటపెట్టారు. నేను ఇక్కడికి మాట్లాడటానికి రాలేదు. మీరు చెప్పింది వినడానికి.. అర్థం చేసుకోవడానికి మాత్రమే నేను ఇక్కడికి వచ్చాను. రాజన్న బిడ్డ ఒక్క మాట పిలవగానే ఇంత దూరం వచ్చిన మీ అందరికీ కృతజ్ఞతలు. రాజన్న రాజ్యంలో ప్రతిరైతు రాజులా బతికారు. రాజన్న రాజ్యం మళ్లీ రావాలి. రాజన్న రాజ్యం నాతోనే సాధ్యం అని నా నమ్మకం. రాజన్న రాజ్యంలో ప్రతి పేదవాడికి ఒక పక్కా ఇల్లు ఉండాలని కలలు కన్నారు. ప్రతి పేద విద్యార్థి గొప్ప చదువులు చదవాలని.. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయాలని రాజన్న అనుకున్నారు. పేదరికం అన్నది ఒక శాపమని.. దాన్ని రూపుమాపాలని నాన్నగారు శ్రమించారు. పేదవాడు అనారోగ్యంతో అప్పులు కాకూడదని.. చనిపోకూడదని ఆరోగ్య శ్రీ తెచ్చారు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. అవన్నీ మీకు ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. అందుకే రాజన్న రాజ్యం రావాలని నా కోరిక. ఈ పక్రియలోనే.. ఇందులో భాగంగానే ఇవాళ ఈ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించాం. మీకు తెలిసినంతగా నాకు తెలియదు. మీ.. మీ సస్సల్లాల్లో మీరేం చేశారు..? మీ సలహాలు, మీ సూచనలు ఇవ్వండి. మీరు చెప్పే విషయాలు వినడానికి.. అర్థం చేసుకోవడానికే నేను వచ్చాను.. వెల్ కమ్..' అని తన ప్రసంగాన్ని షర్మిల ముగించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు, నేతలు కార్యక్రమంలో ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇక షర్మిల కొత్త పార్టీ ఏర్పాటుపై సూచనప్రాయంగా నిర్ణయం తీసుకున్నారని సమాచారం. నల్లగొండ లాగానే అన్ని జిల్లాల నేతలతో కలుస్తానని అన్నారు. ఇకపోతే వై.ఎస్.ఆర్.టి.పి గా పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే, తక్షణమే పార్టీ ప్రకటన ఉండకపోవచ్చని, మార్చిలో పార్టీని ప్రకటించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక పార్టీ ఏర్పాటు కోసం ఓ ప్రముఖ న్యాయవాది ద్వారా ఇప్పటికే షర్మిల ఈసీని సంపారించారని తెలుస్తోంది. షర్మిల కొత్త పార్టీకి సంబందించి పూర్తిగా రూపకర్తగా ఉన్నటువంటి ఆమె భర్త అనిల్.. షర్మిలతోపాటే బయటకు వచ్చి పోడియం ఎక్కించే వరకు ఉన్నారు. తెలంగాణలో కొత్త పార్టీ పెట్టడానికి, వైఎస్ అభిమానులను కలుసుకోవడం.. ఇదంతా బ్రదర్ అనిల్ నేతృత్వం, ఆయన మార్గదర్శకత్వంలోనే జరుగుతున్నట్లుగా సమాచారం. అయితే మంగలవారం ఒక సమావేశంతోనే పరిమితం అవుతున్నట్లుగా తెలుస్తోంది. 150 మంది ముఖ్య నేతలతో షర్మిల సమావేశం నిర్వహించారు. మొత్తంగా తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి షర్మిల వచ్చినట్లుగా తెలియవచ్చింది. షర్మిల ఇప్పటికే ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం వద్ద 'వైఎస్సార్ తెలంగాణ పార్టీ, వైఎస్ రాజన్న రాజ్యం' అనే రెండు పేర్లతో రిజిస్ట్రేషన్ పక్రియ మొదలైనట్లు సమాచారం. దీంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల మంగళవారం తెలంగాణలో కొత్త పార్టీ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఉదయం10 గంటలకు లోటస్‌పాండ్‌లోని తన నివాసంలో నల్గొండ జిల్లా కార్యకర్తలతో భేటీ అయ్యారు. 100 మంది ముఖ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు సమా చారం. నేటి నుంచి తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల వారీగా షర్మిల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నారు. పార్టీ అజెండా, కార్యాచరణ లాంటి అంశాలపై కార్యకర్తలతో చర్చలు జరుపుతారు. చర్చల అనంతరం పార్టీని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా లోటస్ పాండ్‌లోని షర్మిల నివాసం వద్ద భారీగా ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ప్లెక్సీల్లో ఎక్కడా జగన్ ఫోటోలు, వైసీపీ జెండాలు కనిపించకపోవడం విశేషం. కాగా షర్మిల సోమవారం ఉదయం బెంగళూరు నుంచి హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. అయితే వారం ముందు నుంచే ఆమె కార్యాలయం నుంచి తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన.. కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన రాజకీయ పార్టీల్లో క్రియాశీలంగాలేని పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిగినట్లు తెలుస్తోంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెళ్లిరోజు మంగళవారం ఉందని, ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి రావాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలకు సమాచారం అందింది. మన కష్టం తెలుసు..

రాజ్యసభలో ఉద్విగ్న వాతావరణం

గులాం నబీ ఆజాద్‌కు ఘనంగా వీడ్కోలు
మళ్లీ మారు సభకు రావాలన్న అథవాలే

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ గులాం నబీ ఆజాద్ రిటైరవుతున్న వేళ రాజ్యసభలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో సభలో ఆయనకు వీడ్కోలు పలికారు. తొలుత ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఆజాద్ తనకు మంచి మిత్రుడు అని, కశ్మీర్ సీఎంగా ఉన్న సమయంలో.. గుజరాతీ కుటుంబాలకు ఆజాద్ హెల్ప్ చేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఇక తర్వాత ఆజాద్‌కు వీడ్కోలు పలికిన వారిలో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అత్వాలే ఉన్నారు. మళ్లీ సభకు మీరు రావాలంటూ మంత్రి రామ్‌దాస్ అన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ మళ్లీ మీకు ఛాన్సు ఇవ్వకుంటే.. మిమ్మల్ని తీసుకువచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ సభకు మీరు చాలా అవసరమని ఆజాద్‌ను ఉద్దేశిస్తూ మంత్రి రామ్‌దాస్ కామెంట్ చేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా రామ్‌దాస్ అథ్వాలే కొనసాగుతున్నారు. ఎన్‌డీఏ కూటమిలో ఆర్‌పీఐ కూడా భాగస్వామి. సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రిగా అత్వాలే.. మోదీ సర్కార్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రధాని మోదీ

ఇవాళ మాట్లాడుతూ.. ఆజాద్‌ను రిటైర్ కానివ్వబోమని కూడా అన్నారు. దీంతో ఆజాద్ భవిష్యత్తుపై అందరి దృష్టిపడింది.

మహబూబ్‌నగర్‌లో జాగృతి ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు.. ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 : తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జాగృతి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కేసీఆర్ - 2021 జిల్లా స్థాయి పురుషుల ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను మంత్రి ప్రారంభించారు.

వాలీబాల్ క్రీడలో పాలమూరు నుంచి అనేక మంది జాతీయ స్థాయికి ఆడారని మంత్రి గుర్తు చేశారు.మహబూబ్‌నగర్‌లో ప్రారంభించనున్న వాలీబాల్ అకాడమీ ద్వారా మెరికల్లాంటి ఆటగాళ్లను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కవిత సారథ్యంలో ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ జాగృతి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి ప్రశంసించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్, జాగృతి జిల్లా అధ్యక్షుడు వెంకట్ రామ్మూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, జిల్లా ఒలంపిక్ కమిటీ అధ్యక్షుడు రవికుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

కిన్నెర, ద్వానా కుటీరం, నేటినిజం దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు కీ॥శే॥ డా॥ ద్వా.నా.శాస్త్రి సంస్మరణ సభ సందర్భంగా

"నాన్న" అంశంపై కవితల పోటీ

ప్రథమ బహుమతి రూ.5,000/- నగదు, ప్రశంసా పత్రము,
ద్వితీయ బహుమతి రూ.3,000/- నగదు ప్రశంసా పత్రం
తృతీయ బహుమతి రూ.1,000/- నగదు ప్రశంసా పత్రము,
ప్రోత్సాహక బహుమతులు 5: ఒక్కొక్కరికి రూ.500/-లు

రెండక్షరాల పదం, రెండు సెకండ్ల పిలుపు వర్ణించలేనంత ప్రేమ జన్మంతా సరిపడా నమ్మకం "నాన్న"
కుటుంబానికి మకుటం లేని మహారాజుగా నిలబడి జీవితాన్నంతా ధారపోసి ఏమీ ఆశించని రూపం "నాన్న"
ఇంతకంటే ఏం చెప్పగలం? ఇంతకంటే ఏం రాయగలం? అనుకుంటున్నారా... ఎంతో రాయవచ్చు.. త్యాగమనే పదంలో ఇరుక్కుని ఎవరికీ కనబడని పాత్ర "నాన్న"
ఇరవైఐదు వాక్యాలకు మించకుండా "నాన్న" పై మీకున్న అనురాగానికి అక్షర పట్టాభిషేకం చేయండి.

కవితలను 12-02-2021 లోగా పంపించండి..
(ఈ పోటీకి 50 సం॥లలోపు వారు మాత్రమే అర్హులు)

కవితలు పంపవలసిన చిరునామా:
నేటినిజం దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్ నగర్, హైదరాబాద్-20

నేటినిజం
బుధవారం 10-2-2021

బిజెపి తీరుతో ప్రజల బేజారు !

బిజెపి తీరు..నానాటికీ తీసికట్టు నాగంభొట్లు ..అన్నట్లుగా తయారయ్యింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోఅధికారంలోకి రావాలని ఆశ పడుతున్న బిజెపి అసలు ఎజెండా ఏమిటో చెప్పడం లేదు. ప్రజల సమస్య లను పరిష్కరించే తీరులో నిజాయితీ కనిపించడం లేదు. ఆహా ఓహో అంటూ. భజనలను చేయించు కోవడం తప్ప అధినాయకత్వం సమస్యలను సత్వర పరిష్కారం చూపడం లేదు. ఎపిలో అమరావతి రాజధాని ఉద్యమంపై స్పష్టత లేదు. హైకోర్టు మార్పుపైనా స్పష్టత లేదు. అలాగా తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మాత్రం తెగనమ్మడానికి ఉత్సాహం చూపుతోంది. విశాఖ స్టీల్ కోసం ఆందోళన చేస్తున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. అధికార వైకాపా కూడా సమస్యలను పక్కన పెట్టి మోడీ నిర్ణయాలను అంగీకరిస్తూ పోతోంది. తెలంగాణలో సైతం ప్రజా సమస్యలపై స్పష్టత కానరావడం లేదు. అధికార టిఆర్ఎస్ అక్రమాలను అడ్డుకునే యత్నాఉల చేయడం లేదు. ఇక ఎపి విషయానికి వస్తే ప్రధానంగా రాజధాని, పోలవరం, విశాఖ ఉక్కుపై ప్రజలకు ఎలాంటి హామీ ఇస్తారో కూడా చెప్పడం లేదు. అయితే కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలో ఆ పార్టీ ఆశలపై నీళ్లు జల్లుతున్నాయి. విశాఖ ఉక్కును ప్రైవేటీక రించాలన్న నిర్ణయం విషయంలో కేంద్రప్రభుత్వం అడుగులు ముందుకేస్తే బిజెపికి పుట్టగతులండవని ఇతర పార్టీల నేతలు హెచ్చరిస్తున్నారు. విశాఖ ఉక్కు విక్రయం జరిగితే ప్రజలు బీజేపీని ఆదరిస్తారన్న భరోసా లేదు. ఈ ప్రభావం మున్ముందు బీజేపీ–జనసేన సంబంధాలపై కూడా పడే అవకాశముంది. బీజేపీతో కలిసి నడిస్తే మునిగిపోతామని తెలుసుకున్న మరుక్షణం జనసేన వెనక్కి పోవడం ఖాయం. విశాఖ ఉక్కు విషయంలో కేంద్రం తీరును అడ్డుకోవాల్సిన బాధ్యత బీజేపీ– జనసేన కూటమిపైనే ఎక్కువగా ఉంది. ఇకపోతే విశాఖ ఉక్కు వ్యవహారంలో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా ఇరకాటంలో పడిందనే చెప్పాలి. విమర్శలు వస్తున్న నేపథ్యంలో సిఎం జగన్ ప్రధాని మోడీకి లేఖ రాశారు. అధికారంలో ఉన్నందున కేంద్రాన్ని నిలువరించే బాధ్యత నుంచి ఆ పార్టీ కూడా తప్పుకోజాలదు. కార్యనిర్వాహక రాజధాని పేరిట విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ పునాదులను మరింత పటిష్ఠం చేసుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి విశాఖ స్టీల్ సవాల్ కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేంద్రం పై ఒత్తిడి పెంచితేనే జగన్‌పై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. కేంద్ర నిర్ణయాన్ని ప్రతిఘటిస్తారా? లేక రాజీ పడిపోతారా? అన్నది తేల్చుకోవాలి. ప్రత్యేక హోదాను అటకెక్కించినట్టుగా విశాఖ ఉక్కు విషయంలో కూడా మౌనంగా ఉండిపోతే జగన్‌కు నష్టం జరగవచ్చు. ముఖ్యమంత్రి జగన్ బాటలోనే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కూడా కేంద్రపెద్దలకు భయపడి విశాఖ ఉక్కు విషయంలో మెతక వైఖరి అవలంబిస్తే టిడిపికి కూడా పుట్టగతులు ఉండవు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజల పక్షాన ముందుండి పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తెలుగుదేశంపై అధికంగా ఉంది. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికైనా రాజకీయపార్టీలు విభేదాలు పక్కనపెట్టి ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలి.

రాజధాని కూడా లేకుండా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని కోసం రైతులు తమ భూములను త్యాగం చేస్తే, ఇప్పుడు వారిని ఎగతాళి చేస్తున్నారు. రాజధాని అమరావతి అంటే 29 గ్రామాల ప్రజల సమస్యగానే చూస్తున్నారు. అలాగే అదేదో చంద్రబాబు భూ సమస్యగా చూస్తున్నారు. దీంతోపాటు కేంద్రంతో ఢీకొనలేని స్థితిలో సిఎం జగన్ ఉన్నారు. రాజధాని ఉన్నా లేకపోయినా ఒక్కటే అన్న ధోరణి కనిపిస్తోంది.కేవలం ఇదంతా ఒక్క సామాజికవర్గానికి మాత్రమే ఉపయోగం అన్న ధోరణిలో ఉన్నారు. దీంతో అమరావతి అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారింది. భూములిచ్చిన రైతులు చేస్తున్న పోరాటం పొరుగు గ్రామాల ప్రజలను

కూడా కదిలించలేకపోతోంది. ఇతర ప్రాంతాల ప్రజలు ఉదాసీనంగా ఉంటున్నారు. అమరావతి తర్వాత పోలవరం ప్రాజెక్టు కూడా ఈ జాబితాలో చేరిపోయింది. పూర్తిస్థాయిలో రిజర్వాయర్ నిర్మించడానికి అవసరమైన నిధులు ఇవ్వడానికి కేంద్రం ససేమిరా అంటున్నా, రాష్ట్ర ప్రభుత్వం కూడా నోరెత్తలేకపోతోంది. మొన్నటి బడ్జెట్‌లో సవరించిన అంచనాలపై మాటమాత్రంగా అయినా ప్రస్తావించలేదు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం నిర్మాణం నిమిత్తం రూ.4,896 కోట్లు విదిలించిన ప్రభుత్వానికి ఉక్కు కర్మాగారం, ఉద్యోగులు వివిధ పన్నుల రూపంలో 42 వేల కోట్ల రూపాయలు చెల్లించారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్లనే నష్టాలు వస్తున్నాయని ఉద్యమనేతలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకు అవిశ్రాంత పోరాటం చేస్తామన్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా రక్షించడానికి విశాఖలో అన్ని రాజకీయ పక్షాలు ముందుకు వస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్... స్టీల్ ప్లాంట్ విక్రయం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, వాటాను ఈక్విటీగా మార్చాలని ప్రధానికి లేఖ రాయడంతో వైసీపీ నేతలంతా విశాఖ ఉక్కుపై మాట్లాడటానికి ధైర్యంగా ముందుకు వస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు ఉత్తుత్తి పోరాటాలతో ప్రయోజనం లేదని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రైవేటీకరణపై ఎవరితోనూ చర్చించంకుండా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. దీనిపై రాష్ట్ర బీజేపీ, జనసేన నేతలు స్పందించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే బీజేపీ నేతలతో తాము కూడా ఢిల్లీకి వెళతామన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దుస్సాహసమని, ఆంధ్రులకు అవమానకరమని అన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పార్టీలక తీతంగా కేంద్ర నిర్ణయంపై పోరాడతామని స్పష్టం చేశారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ విశాఖ ఉక్కు యూనియన్ నాయకులతో చర్చించి, కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తే తాను మద్దతు ఇస్తానని చెప్పారు. అవసరమైతే ఎంపీ పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు. కాగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం వెనుక ఎటువంటి రాజకీయం లేదని, లక్షలాది మంది ఆధారపడిన విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నానని గంటా శ్రీనివాసరావు.... చెప్పారు. విశాఖ ఉక్కును రక్షించుకోవడానికి రాజకీయేతర జేఏసీని ఏర్పాటుచేసి ముందుకువెళదామని వారికి వివరించారు. విశాఖ స్టీల్ఏ÷–లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రత్యక్ష ఉద్యమాలు

చేస్తామని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే తీవ్ర ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌టుపరం చేసేందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు నేతలు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని, కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని,రోడ్లపైకి వచ్చి ఉద్యమంలో చేరాలని డిమాండ్ చేశారు.

అని చెప్పుకోవడమే తప్ప నేతలు అలా భావిస్తున్నట్టుగా లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్మించే పోలవరం పూర్తయితే తమకే లాభం అన్న భావనలో ప్రజలు కూడా లేరు. పోలవరం ప్రాజెక్టును ఒక బ్యారేజి స్థాయికి కుదించబోతున్నారన్న చర్చపైనా స్పందించడం లేదు. అమరావతికి, నిన్న పోలవరానికి పట్టిన గతి తెలిసి కూడా ప్రజల్లో కనీసం చైతన్యం లేకపోవడాన్ని గమనించిన కేంద్రం ఇప్పుడు విభజన హామీలపై పెద్దగా స్పందించడం లేదు. బీజేపీ నాయకులకు కూడా ప్రధాన సమస్యలపై కేంద్రంతో పోరాడే ధైర్యం చాలడం లేదు. త్యాగాల పునాదుల మీద నిర్మించిన విశాఖ ఉక్కును అమ్మేస్తామని చెబుతున్నా బిజెపి నేతలు నోరు మెదపడం లేదు. కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాలు ఉద్యమిస్తున్నా పట్టించుకోవడం లేదు. అమరావతి, పోలవరం విషయంలోనూ అదే వైఖరి అవలంబించారు. జనసేన సహకారంతో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సవాలు విసురుతున్న తరుణంలో ఈ మూడు ప్రధాన సమస్యలపై ఎలాంటి వైఖరి తీసుకోబోతున్నారో చెప్పడం లేదు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీయే ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించి నాలుక కరుచుకున్నారు. ఇక తెలంగాణలో అనేకానేక సమస్యలపై ఉద్యమిస్తున్నా.. ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై కేంద్ర బిజెపి నాయకత్వం నోరు మెదపడం లేదు. మొత్తంగా రాష్ట్రప్రభుత్వాల విషయంలో బిజెపి వైఖరి మెతకగా ఉంటూ తమ పని కానిచ్చే వ్యూహంలో ఉన్నారా అన్నది అర్థం కావడం లేదు. ఇలాగే ద్వంద్వ విధానాలు అవలంబిస్తే బిజెపిని కూడా ప్రజలు నమ్మరని గుర్తించాలి.

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన

మేడ్చల్ మల్కాజ్‌గిరి, ఫిబ్రవరి 9 : జిల్లాలోని మేడ్చల్ నియోజకవర్గం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ. 1 కోటి 23 లక్షల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బీ.టీ రోడ్డు, డంపింగ్ యార్డ్, వైకుంఠధామం వంటి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పావని జంగయ్య యాదవ్, మున్సిపల్ కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి

తిరుమల,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

అమరావతి భూములపై సుప్రీం విచారణ

–తదుపరి విచారణ మార్చి 5కి వాయిదా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): అమరావతి భూముల అంశంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సిట్, కేబినెట్ సబ్ కమిటీపై హైకోర్టు విధించిన స్టే ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అశోక్‌భూషణ్, జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి గడువు కావాలని ప్రతి వాదులు కోరగా.. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి 5కి వాయిదా వేసింది. దమ్మాలపాటి కేసును కూడా అప్పుడే విచారిస్తామన్న సుప్రీంకోర్టు.. ఇప్పటికే హైకోర్టులో ఈ కేసు విచారణను జరపొద్దని చెప్పామని జస్టిస్ అశోక్‌భూషణ్ స్పష్టం చేశారు. మార్చి 5న పూర్తి స్థాయి వాదనలు వింటామని తెలిపారు.

జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించండి రాజ్యసభలో ఆజాద్ డిమాండ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలంటూ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ డిమాండ్ చేశారు. రాజ్యసభలో జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2021పై ఆయన ప్రసంగిస్తూ ఈ మేరకు డిమాండ్ చేశారు. జమ్మూ కశ్మీర్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ కేడర్ అధికారులను అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్రపాలిత ప్రాంతం (ఏజీఎంయూటీ) కేడర్‌లో విలీనం చేసే ఈ బిల్లు ఇవాళ ఆమోదం పొందిన విషయం తెలిసిందే. యూటీ హోదా వల్ల జమ్మూ కశ్మీర్‌కు మంచి కంటే చెడే ఎక్కువగా జరుగుతున్నదని ఆజాద్ అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో ఎక్కువ ప్రాంతం అడవులు, కొండలతో ఉన్నందున అక్కడ నివాసయోగ్యమైన భూములు చాలా తక్కువ అని ఆయన అన్నారు. కేంద్ర పాలిత ప్రాంతం కాగానే కొందరు అక్కడ స్థలాలు కొంటామంటూ చెబుతున్నారనీ.. కానీ శ్రీనగర్ వంటి నగరాల్లో ఎకరం భూమి రూ.40–50 కోట్లు పలుకుతున్నదన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత కశ్మీర్‌లో నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని ఆజాద్ పేర్కొన్నారు. ఇక్కడికి కొత్తగా ఎలాంటి పరిశ్రమలూ రాకపోగా.. అస్థిర పరిస్థితుల వల్ల 60 శాతం పరిశ్రమలు మూతపడ్డాయని ఆయన ఆరోపించారు.

అసోంలో స్వల్ప భూకంపం

గౌహతి,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): అసోంలోని నాగాన్‌లో సోమవారం స్వల్ప భూకంపం చోటుచేసుకుంది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 3.7గా నమోదైనట్టు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ (ఎన్‌సీఎస్) పేర్కొంది. మధ్యాహ్నం 1.49 గంటల సమయంలో ప్రకంపనలు వచ్చినట్టు ఎన్‌సీఎస్ పేర్కొంది. తేజ్‌పూర్‌కి 35 కిలోమీటర్ల దూరంలో, 30 కిలోమీటర్ల లోతున భూకంపం కేంద్రీకృతమైనట్టు ఎన్‌సీఎస్ ట్వీట్ చేసింది. కాగా ఇవాళ ఉదయం పంజాబ్‌లోని బఠిండలో 3.5 తీవ్రతతో మరో భూకంపం చోటుచేసుకుంది.

కాల్పుల విరమణకు తూట్లు

–దాయాది పాకిస్తాన్ 5,133 సార్లు కాల్పులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): గత యేడాది దాయాది పాకిస్తాన్ 5,133 సార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ సంఘటనలో 46 మంది భారతీయ జవాన్లు అమరవీరులయ్యారని తెలిపారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ ..పాక్ గతేడాది 5,133 సార్లు కాల్పుల విమరణ ఒప్పందానికి తూట్లు పొడించింది. దీంతో 46 మంది జవాన్లు అమరులయ్యారు. దీనికి దీటైన సమాధానమే ఇచ్చారు మన సైనికులని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాము పాక్ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఇరు దేశాలకు చెందిన మిలటరీ అధికారులతో చర్చలు జరిపినట్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. దౌత్యపరంగా కూడా అత్యున్నత స్థాయిలో ఈ విషయాన్ని భారత్ చాలాసార్లు ప్రస్తావించిందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

ఉధృతం అవుతున్న ఉక్కు ఉద్యమం

ఏకమవుతున్న రాజకీయ, కార్మిక సంఘాలు పార్టీలకు అతీతంగా పోరాడాలని నిర్ణయం

విశాఖపట్టణం,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): ఉక్కు పరిరక్షణ ఉద్యమం ఊపందుకుంటోంది. పార్టీలకు అతీతంగా ముందు ప్రజా సంఘాల నేతలు, కార్మాకులు ఒక్కటవుతున్నారు. కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ...ఉద్యోగ, కార్మిక సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ఒకపక్క వేర్వేరుగా పోరాటం చేస్తూనే, మరోపక్క ఐక్య పోరాటానికి సన్నద్ధమవుతున్నాయి. మరోవైపు రాజకీయాలకు అతీతంగా పోరాడాలని పిలుపునిస్తున్నారు. ఉద్యమానికి వైకాపా కూడా మెల్లగా మద్దతు ఇస్తోంది. అలాగే టిడిపి కూడా దీనిని ప్రధాన ప్రజా పోరాటంగా ముందుకు తీసుకుని వెళ్లే ప్రయత్నాల్లో ఉంది. లెఫ్ట్ కారకమిక నేతలు, కవులు,కళాకారులు కూడా ఏకమవుతున్నారు. ఈ క్రమంలో బిజెపిని ఎండ గడుతూ అన్ని పార్టీలు ఏకమయ్యేలా కనిపిస్తోంది. రాజధాని అమరావతి ఉద్యమంలో కానరాని ఐక్యత స్టీల్ ప్లాంట్ విషయంలో కానవస్తోంది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం నగరంలో పలుచోట్ల ఆందోళనలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొని అండగా ఉంటామని, పోరాటంలో పాల్గొంటామని ప్రకటిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ విశాఖ ప్రజల గుండె చప్పుడు అని ప్రజలంతా ముక్తకంఠంతో స్పష్టంచేశారు. నష్టాలు వస్తున్నాయన్న సాకు చూపించి ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమని ప్రకటించారు. స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద వరుసగా మంగళవారం కూడాఉదయం కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు జెండాలను పక్కనపెట్టి, ఒకే ఎజెండాతో అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు పోరాడేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్ ఎదుట నిరసన చేయడంతో పాటు అవసరమైతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. నగరంలోని వివిధ నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొంటున్నారు. పార్టీ కండువాలను పక్కనపెట్టి సమష్టిగా పోరాడదామన్నారు. పోరాటంతోనే ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకుంటామన్నారు. ప్రైవేటు శక్తులపరం కాకూడదంటే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఐక్యపోరాటమే శరణ్యమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయాలు చూస్తుంటే దేశభక్తి మునుగులో దేశాన్ని అమ్మకానికి పెడుతోందన్న అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకొని దేశీయ ఉక్కు రంగంలో అగ్రగామిగా దూసుకుపోతున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమని, దీనిని ఖండిస్తున్నామని అన్నారు. 3.5 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో స్థాపించబడి...నేడు 7.5 మెట్రిక్ టన్నుల స్థాయికి చేరుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం తగదన్నారు.

సంప్రదాయ నాగోబా జాతరకు సర్వం సిద్ధం

11నుంచి 15వరకు నాగోబాకు పూజలు
గంగాజలంతో మర్రిచెట్టు వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులు

ఆదిలాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): కరోనాతో నాగోబా జాతర కళ తప్పనుంది. పరిమిత సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. అధికారులు కూడా ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. అలాగే జాతరలో ముఖ్య ఘట్టంగా ఉంటూ వస్తున్న దర్బార్‌ను రద్దు చేశారు. మెస్రం వంశీయులు సంప్రదాయరీతిలో నిర్వహించే నాగోబా జాతర త్వరలో ప్రారంభం కానుంది. ఫిబ్రవరిలో 11నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ఈ మహా నాగోబా జాతరకు మెస్రం వంశీయులు గంగాజలంతో సిద్ధంగా ఉన్నారు. పవిత్ర గంగాజలంతో కేస్లాపూర్ మర్రిచెట్ల వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు నిర్వహించారు. నైవేద్యాలతో కూడిన వెదురు బుట్టలను మెస్రం మహిళలు పూజ కోసం వరుసలతో ఉంచారు. మహిళలు బుట్టల వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఎడ్లబండ్లను వదిలి ప్రత్యేక గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు. మర్రి చెట్టు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో మహిళలు, పురుషులు వేర్వేరుగా కూర్చొని పూజలతో పాటు కార్యక్రమాలపై చర్చించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన మెస్రం పటేళ్లకు నాగోబా పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, దాదారావ్, తుకోడోజీ గణపతి, తిరుపతిల తో పాటు మరి కొందరు మెస్రం వంశీయులు వారిని ఆహ్వానించారు. ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో నిర్వహించే ఈ జాతరకు సిరికొండ మండలానికి ప్రత్యేక అనుబంధముంది. నాగోబాకు నిర్వహించే పూజలు, నైవేద్యాలు, వంట, నీరు, తదితరాల కోసం వినియోగించే కుండలను సిరికొండ నుంచే తీసుకెళ్తారు. మండల కేంద్రానికి చెందిన గుగ్లిల్ల వంశీయులు యేటా ఈ కుండలను తయారు చేస్తారు. ఫిబ్రవరిలో 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ఈ మహా నాగోబా పూజకు మూడు రోజులు ముందుగానే ఈ కుండలు కెస్లాపూర్‌కు చేరుకుంటాయి. పుష్యమాసం ప్రారంభం కాగానే గుగ్లిల్ల వంశీయుడు ఈ కుండలను తయారు చేసే పని మొదలుపెడతాడు. ఎన్నో ఏళ్లుగా ఈ వంశీయులే మెస్రం వంశీయులకు వీటిని అందిస్తున్నారు. సిరికొండ ఒక చారిత్రక గ్రామం. ఇక్కడ గతం లో సుమారు వెయ్యి కుమ్మరి కులస్తుల కుటుంబాలు నివాసముండేటివి. కుండలను తయారు చేసి మార్కెట్లో విక్రయించేవారు. దాంతో వచ్చే ఆదాయంతోనే కుటుంబాలను పోషించుకునేవారు. వీరంతా గుగ్గిల్ల వంశీయులే. కాగా, కాలక్రమేణా వీరంతా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. మరికొందరు ఈ వృత్తిలో స్థిరపడిపోయారు. మెస్రం వంశానికి చెందిన ఓ పెద్ద మనిషికి ఒక రోజు దేవత కలలోకి వచ్చి సిరికొండ గుగ్గిల్ల వంశీయులు తయారు చేసిన కుండలనే పూజకు వాడాలని చెప్పిందని పెద్దలు చెబుతుంటారు. అప్పటి నుంచి సిరికొండలో గుగ్గిల్ల వంశీయులతో ప్రత్యేకంగా నాగోబా జాతరకు కుండలను తయారు చేయించి, పూజలకు వాడుతన్నారు. గుగ్గిల్ల వంశానికి చెందిన రాజన్న తొలుత ఈ కుండలను అందించాడు. ఆయన మరణానంతరం లస్మన్న, ఆ తర్వాత ఆయన కుమారుడు స్వామి వీటిని తయారు చేస్తున్నాడు. జాతరకు మూడు రోజుల ముందు మెస్రం వంశీయులు సిరికొండకు వచ్చి, ఇక్కడినుంచి ఎడ్ల బండ్ల ద్వారా గంగకు బయలుదేరుతారు. ఈ కుండల ద్వారా గంగా జలాన్ని సేకరించి, కెస్లాపూర్‌కు సమీపంలో ఉన్న మర్రి చెట్టు కింద ఉంచి పూజలు చేస్తారు. ఆ తర్వాత ఈ కొత్త కుండలను ఆలయం వద్దకు తీసుకెళ్తారు. కుండల ద్వారా తెచ్చిన గంగాజలంతో నాగోబా దేవతకు అభిషేకం చేస్తారు. ఈ కుండలో వండిన నైవేద్యాన్ని దేవతకు సమర్పిస్తారు

సడక్ యోజనకు అటవీ క్లీయరెన్సులు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్

హైదరాబాద్,ఫిబ్రవరి 9(ఆర్ఎన్ఎ): ప్రధాన మంత్రి గ్రామ సడక్‌యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో జరిగే రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి మార్చి 15వ తేదీ నాటికి అటవీ క్లియరెన్స్ పూర్తిచేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హా సోమవారం దేశంలోని అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్నరోడ్లు పనులకు సంబంధించి అటవీ క్లియరెన్స్‌కు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. పీఎంజీఎస్‌వై పథకంలో భాగంగా జరుగుతున్న రోడ్డు పనులకు ఆటంకాలు రాకుండా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అటవీ క్లియరెన్స్ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు నిర్మాణాల్లో భూములను కోల్పోయే వారికి నష్టపరిహారం ఇచ్చే విషయంలో వారం వారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించడం, సరైన సమయంలో అటవీ క్లియరెన్స్ ఇచ్చే విషయంలో చర్యలు తీసుకుంటున్నట్టు సీఎస్ సోమేశ్‌కుమార్ వివరించారు. ఈ సమావేశంలో ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి, ఆర్‌అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, పంచాయితీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, అటవీశాఖ పీసీసీఎఫ్ శోభ పాల్గొన్నారు.

వ్యయసాయ చట్టాలను ముందు రద్దు చేయాలి

–రైతులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పాలి: కూనంనేని

ఖమ్మం,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): వ్యవసాయ రంగంపై కేంద్రంనిర్లక్ష్యం, రైతు వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు జురుగుతన్నా కేంద్రం నిమ్మకు నీరె

చర్చలకు సిద్ధమన్న ప్రధాని మోడీ

మేం రెడీ అంటున్న రైతు సంఘాల నేతలు

తేదీ..స్థలం నిర్ణయించాలని ప్రకటన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కొనసాగుతుందని రైతులకు భరోసా ఇచ్చి నెలరోజుల ప్రతిష్టంభనను అంతం చేయడానికి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులను తదుపరి రౌండ్ చర్చలకు ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానించారు. దాంతో ఆందోళన చేస్తున్న కిసాన్ నాయకులు చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. తదుపరి చర్చకు తేదీని ఎన్నుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలపై ఆందోలన చేస్తున్న రైతులు, కేంద్ర ప్రభుత్వం మధ్య ఇప్పటివరకు 11 రౌండ్ల చర్చలు జరిగాయి. కనీస మద్దతు ధర కొనసాగుతుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. దీనిపై పలు రైతు సంఘాలు హర్షం వ్యక్తం చేయడమే కాకుండా ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ సంకేతాలిచ్చారు. తదుపరి రౌండ్ చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, సమావేశం జరిగే తేదీ, సమయాన్ని ప్రభుత్వం తెలియజేయాలని సంయుక్త కిసాన్ మోర్చా సభ్యుడు, రైతు నాయకుడు శివ కుమార్ కక్కా కోరారు. 'మేం ప్రభుత్వంతో చర్చలు జరపడానికి ఎప్పుడూ నిరాకరించలేదు. మమ్మల్ని సంభాషణల కోసం పిలిచినప్పుడల్లా కేంద్ర మంత్రులతో చర్చలు జరిపాం. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నాం' అని కక్కా చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ రాజ్యసభలో సమాధానమిస్తూ.. కనీస మద్దతు ధర ఉన్నది.. ఇకముందు కూడా ఉంటుంది అని స్పష్టంచేశారు. రైతులతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇదే విషయాన్ని గతంలోనూ స్పష్టం చేశామని చెప్పారు. భారతదేశానికి శత్రువులుగా ఉన్న విదేశీ సంస్థల పట్ల జాగ్రత్త వహించాలని ఆయన నిరసనకారులను కోరారు. ప్రధాని చేసిన సూచనకు సానుకూలంగా స్పందించిన రైతు సంఘాలు.. ప్రభుత్వం చర్చలకు తేదీని నిర్ణయిస్తే ఆ రోజు రావడానికి సిద్ధమని ప్రకటించాయి.

రాజన్న ఆలయానికి పోటెత్తిన జనం

కోడె దాడిలో గాయపడ్డ మహిళ

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజన్ ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. సుమారు 40 వేల మంది భక్తులు వచ్చారని, రూ.18 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. వేములవాడ రాజన్న సన్నిధికి దర్శనానికి వచ్చిన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సులోచన కోడెల దాడిలో సోమవారం గాయపడింది. కోడెమొక్కు చెల్లించుకునేందుకు వెళ్లగా ఒక్కసారిగా కోడెలు ఆమెపై దాడిచేశాయి. దీంతో ఆమె కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే బంధువులు ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మహబూబాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జిల్లా పోలీసులు పట్టుకున్నారు. సీరోల్ పోలీస్టేషన్ పరిధిలోని చింతపల్లి గ్రామంలో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చింతపల్లిలో డీసీఎంలో వ్యాన్‌లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని వ్యాన్‌లో తరలిస్తున్న 125 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. డీసీఎం వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అక్రమంగా ఎవరైనా రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శంషాబాద్ పరిసరాల్లో తిరుగుతున్నది అడవి పులి

-సిసి కెమెరాల ద్వారా గుర్తించిన అధికారులు

హైదరాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో తిరుగుతున్న జంతువు అడవి పిల్లిగా నిర్ధారణ అయింది. గతకొంతకాలంగా తిరుగుతూ స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాల్లో అడవి పిల్లి చిత్రాలు గత రాత్రి స్పష్టంగా రికార్డు అయ్యాయి. గత కొంత కాలంగా శంషాబాద్ పరిసరాల్లో చిరుత పులి సంచారం ఉందనే వార్తలు వచ్చాయి. అయితే అటవీ శాఖ సిబ్బంది పెట్టిన నిఘాలో చిరుతకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు, కదలికలు లభ్యం కాలేదు. విమానాశ్రయం సిబ్బంది, స్థానికులు భయపడుతున్నారనే సమాచారంతో అటవీ శాఖ కెమెరాలు, బోనులను ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేసింది. మంచి ఆరోగ్యంగా, ధృడంగా ఉన్న అడవి పిల్లి చిత్రాలు కెమెరాకు చిక్కాయని, చిరుత సంచారం లేదని శంషాబాద్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి సీహెచ్. శివయ్య తెలిపారు. స్థానికుల భయపడాల్సిన అవసరం లేదని అన్నారు.

తెలంగాణలో మహిళలకే ప్రభుత్వ పథకాల నగదు

స్టార్టప్‌ల సక్సెస్‌కు టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ముఖ్యమే: కవిత

హైదరాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): తెలంగాణలో అనేక ప్రభుత్వ పథకాల నగదు మహిళకే అందిస్తూ, ఆర్థిక చేయూతనిస్తున్నామన్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఇండియాలో 90 శాతం స్టార్టప్‌లు టీం మేనేజ్ మెంట్ లేక ఫెయిల్ అవుతున్నాయని ఒక సర్వేలో తేలిందన్నారు. స్టార్టప్ సక్సెస్ అవ్వాలంటే ఐడియాతో పాటు, టీం మేనేజ్ మెంట్ కూడా ముఖ్యమన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం, 33 శాతం మార్కెట్ కమిటీ పదవులు, షీ టీంలు, విద్యా సంస్థలు, పెన్షన్లు వంటి అనేక కార్యక్రమాలతో మహిళల ఆర్థిక స్వావలంభన చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రతిష్టాత్మక అశోక యూనివర్సిటీ, వీ-హబ్ సంయుక్తంగా నిర్వహించిన వెబినార్ లో ఆమె ప్రసంగించారు. మహిళ చేతిలో ఆర్థిక నియంత్రణ ఉంటే బాగుంటుందన్నారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా వెబినార్‌లు నిర్వహిస్తున్న అశోకా యూనివర్సిటీ, వీహబ్ లను ఎమ్మెల్సీ కవిత అభినందించారు. రాజకీయ నాయకులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇతర దేశాల మాదిరిగా ఇండియాలో సైతం వ్యాపారాలను ప్రోత్సహించేవిధంగా అవినీతి రహిత విధానాలు రూపొందించాలన్న కవిత, ఉన్నత విద్యను సైతం సహకారాలు అందించాలన్నారు. జాతీయ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ లాంటి భవిష్యత్ టెక్నాలజీలపై ప్రత్యేక విధానం ఉండాల్సిన ఆవశ్యకత ఉందని కవిత గుర్తుచేశారు. దేశంలో పాలసీ పరంగా పరిమితులు ఉన్నాయని ఎవ్వరూ భావించొద్దని, ఆన్‌లైన్ లో వ్యాపారం ప్రారంభించి అంతర్జాతీయంగా ఎదిగేందుకు సైతం అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వీ హబ్ సీఈవో దీప్తి రావుల, అశోక యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం పదవిపై ఇంత చులకనా: రఘునందన్ రావు

సిద్దిపేట,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): సీఎం పదవిపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు తప్పుబట్టారు. ప్రజలు ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో ఓట్లేసి గెలిపించిన సీఎం కుర్చీని ఎడమకాలు చెప్పుతో సమానమన్న కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమేనన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో బిర్యానీ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు ఓట్లేసి గెలిపించిన సీఎం కుర్చీ నచ్చకపోతే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. సీఎం తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎపిలో మొదలయిన తొలిదశ పంచాయితీ ఎన్నికలు

ఎపిలో పంచాయితీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వద్ద దృశ్యాలు

ఉదయం 10.30 గంటల వరకు 34.28 శాతం పోలింగ్

పలుచోట్ల ప్రలోభాలకు తెర..పట్టుకున్న పోలీసులు

ఓటు హక్కు వినియోగించుకున్న ముద్రగడ

అమరావతి,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): ఏపీ వ్యాప్తంగా తొలిదశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 10.30 గంటల వరకు 34.28 శాతం పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ మందకొడిగా సాగుతుంది. మధ్యాహ్నం 3:30 వరకు పోలింగ్ కొనసాగనుంది. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి గిరిజా శంకర్ పర్యవేక్షిస్తున్నారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లా తలుపుల మండలం కేంద్రంలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని భుజాలపై ఎత్తుకెళుతున్న స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ హరిప్రసాద్‌ను అభినందించారు. సుమారు 7 వేల కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. వెబ్ కాస్టింగ్ ద్వారా గిరిజా శంకర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విజయనగరం మినహా మిగిలిన 12 జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తొలిసారిగా 'నోటా'ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు జరగనుంది. కరోనా పాజిటివ్ బాధితులకు పీపీఈ కిట్లతో చివరిలో గంటసేపు అవకాశం కల్పించనున్నారు. ఉదయం 10:30 వరకు తూర్పుగోదావరి-29 శాతం, పశ్చిమగోదావరి-24 శాతం, కృష్ణా జిల్లా-36 శాతం గుంటూరు జిల్లా-30 శాతం, వైఎస్సార్ జిల్లా- 29.21 శాతం, అనంతపురం-27 శాతం, ప్రకాశం జిల్లా-28.65 శాతం, నెల్లూరు జిల్లా- 26.72 శాతం, చిత్తూరు జిల్లా-36.38 శాతం, కర్నూలు జిల్లా-49 శాతం, విశాఖ జిల్లా 40.78 శాతం, శ్రీకాకుళం జిల్లా- 29.15 శాతం నమోదయ్యింది. గుంటూరు జిల్లా కాకుమాను మండలం గరికపాడులో గుండెనొప్పితో ఏజెంట్ నూర్ బాషా మృతి చెందాడు. గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా ఆయన మృతిచెందారు. చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలో పోలింగ్ సిబ్బంది ఓవరాక్షన్ చేశారు. కమ్మకండ్రిగలో వృద్ధులు చెప్పిన దానికి భిన్నంగా సిబ్బంది ఓటు వేశారు గుర్తించిన ఏజెంట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. రిటర్నింగ్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కడప జిల్లా దువ్వూరు మండలంలో ఓటర్లను టీడీపీ నేతలు ప్రలోభాలకు గురి చేస్తున్నారు. మహిళలకు ముక్కుపుడకలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలను పోలీసులు పట్టుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో 23 శాతం పోలింగ్ నమోదయ్యింది. నిమ్మాడలో పోలింగ్‌ను ఎన్నికల పరిశీలకులు శ్రీధర్ పరిశీలించారు. తూర్పుగోదావరి జిల్లాలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం సూదివారి పాలెంలో టీడీపీ ప్రలోభాలకు పాల్పడ్డారు. ఓటర్లకు డబ్బు పంచుతూ టీడీపీ నేతలు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. కొన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో చలి ఎక్కువగా ఉండటంతో... అక్కడ పెద్దగా ప్రజలు పోలింగ్ కేంద్రాలకు రావట్లేదు. ఉదయం 6.30లకు పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగానే జరుగుతున్నా... అక్కడక్కడా ఊళ్లలో ఘర్షణలు జరుగుతున్న ఘటనలు తెరపైకి వస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో రెండు వర్గాల మధ్య మాటామాట పెరిగింది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ విరుచుకుపడ్డారు. చివరకు కత్తులతో దాడులకు దిగడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదంతా ఎన్నికల కారణంగానే జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇక ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ప్లలేపాలెంలో ఇలాంటిదే మరో ఘటన జరిగింది. డబ్బు ఇస్తున్న కొందరిని ఊరి ప్రజలు అడ్డుకున్నారు. అటు చిత్తూరు జిల్లా బొట్లవారిప్లలెలో అర్ధరాత్రి వైసీపీ మద్దతుదారులు దాడులకు దిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఎంటరవ్వడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇలా అక్కడక్కడా చెదురు మదురు ఘటనలు జరుగుతుంటే... మరోవైపు పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. తొలి విడతలో భాగంగా 3,249 సర్పంచ్ పదవులకు 32,502 వార్డు మెంబర్లు కోసం ఓటింగ్ జరుగుతోంది. మధ్యాహ్నం 3.30వరకూ ఈ పోలింగ్ ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 525 గ్రామ పంచాయతీలు, 12,185 వార్డు మెంబర్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. పోలింగ్ కోసం 29,732 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు 3,458 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా... 3,594 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. నెల్లూరు జిల్లా వరికుంటపాడులో ఓటర్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఓటింగ్ పక్రియను బహిరంగంగా పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం తోకలపూడి గ్రామంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ టీడీపీ సానుభూతి పరుడు, సర్పంచ్ అభ్యర్థి జుత్తిక శ్రీనివాస్ పోలీసులకు పట్టుబడ్డారు. మాడుగుల ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు ఓటు హక్కు వినియోగించు కున్నారు. తొలివిడతలో 3,249 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్లు జారీ చేయగా 525 చోట్ల సర్పంచి ఎన్నిక ఏకగ్రీవం అయ్యాయి. నెల్లూరు జిల్లా వెలిచెర్ల గ్రామంలో సర్పంచి పదవికి ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో మిగిలిన 2,723 చోట్ల సర్పంచి, 20160 వార్డులకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ పర్యవేక్షణకి విజయవాడలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ అభ్యర్థికి పింక్ బ్యాలెట్, వార్డు అభ్యర్థికి తెల్ల బ్యాలెట్‌ను కేటాయించారు.

త్వరలోనే పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి వస్తా

తిరుపత్తూరు జిల్లాలో శశికళకు ఘన స్వాగతం

అన్నాడీఎంకే జెండాలతో అభిమానుల ఆహ్వానం

ముత్తుమారి అమ్మన్ ఆలయంలో శశికళ ప్రత్యేక పూజలు

తమిళనాట శశికళను ఆహ్వానిస్తూ భారీగా కటౌట్లు..బ్యానర్లు

-అన్నా డిఎంకె జెండాలను పెట్టుకోవడాన్ని సమర్థించిన దినకరన్

చెన్నై,ఫిబ్రవరి8(ఆర్ఎన్ఎ): తాను త్వరలోనే పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి వస్తానని ప్రజలను కలుస్తానని ఏఐఏడీఎంకే బహిష్కృత నాయకురాలు శశికళ తెలిపారు. అక్రమాస్తుల కేసులో బెంగళూరు కారాగారంలో నాలుగేండ్లు జైలు శిక్ష అనుభవించి విడుదలైన ఆమె సోమవారం భారీ ర్యాలీగా తమిళనాడు చేరుకున్నారు. తిరుపత్తూరు జిల్లాలో శశికళకు ఘన స్వాగతం పలికారు. అన్నాడీఎంకే జెండాలతో అభిమానులు ఆహ్వానించారు. తొలుత ముత్తుమారి అమ్మన్ ఆలయంలో శశికళ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా మీడియాతో మాట్లాడారు. తాను ప్రతిపక్షానికి భయపడబోనని ఆమె అన్నారు. ఏఐఏడీఎంకే చాలా పోరాటాలను ఎదుర్కొన్నదని, ఫీనిక్స్ లాగా ఉద్భవించిందని శశికళ తెలిపారు. మన ఉమ్మడి శత్రువును ఓడించడానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏఐఏడీఎంకే జెండాను కారుకు పెట్టుకోవడంపై శశికళ సమర్థించుకున్నారు. పార్టీ జెండాను తాను వాడటంపై ఫిర్యాదులు చేసేవారు తనను చూసి భయపడుతున్నారని విమర్శించారు. జయలలిత రాజకీయ వారసురాలిని తానేనని ఆమె చెప్పారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయానికి వెళ్తారా అన్న మీడియా ప్రశ్నకు 'ఏమి జరుగుతుందో వేచి చూడండి' అని సమాధానమిచ్చారు. అనంతరం చెన్నై టీ నగర్‌లోని బంధువుల ఇంటికి శశికళ చేరుకున్నారు.

అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ సీఎం జయలలిత నెచ్చెల్లి.. చ÷-లలెమ్మగా పేరొందిన కే శశికళకు తమిళనాడు గ్రాండ్ రిసెప్షన్ లభించింది. రూ.66.65 కోట్ల అవినీతి కేసులో బెంగళూరులోని జైలులో జైలుశిక్ష అనుభవించిన శశికళ .. నాలుగేండ్ల తర్వాత సోమవారం సొంత రాష్ట్రంలో అడుగు పెట్టారు. కర్ణాటక సరిహద్దుల్లోని కృష్ణగిరి జిల్లా అత్తిపల్లిలో ఉదయం 10 గంటలకు తమిళనాడు గడ్డపై అడుగు పెట్టిన శశికళకు పూలు విసురుతూ, డ్రబ్స్ బీట్స్‌కు అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ ఆమె మద్దతుదారులు పండుగ చేసుకున్నారు. సరిహద్దు కృష్ణగిరి జిల్లా పరిధిలోని పట్టణాల్లో పండుగ వాతావరనం నెలకొంది. చిన్నమ్మకు స్వాగతం పలుకుతూ బ్యానర్లు, ప్లెక్సీ బోర్డులు, పోస్టర్లు, హోర్డింగ్‌లు వెలిశాయి. మహిళా అభిమానులు తమ తలలపై పూలతో అలంకరించిన కలశాలతో శశికళకు స్వాగతం పలికారు. మరో కొన్ని నెలల్లో తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో శశికళ రాక.. రాష్ట్ర రాజకీయాల్లో ఎటువంటి మార్పులకు దారి తీస్తుందోనని విశ్లేషకులు భావిస్తున్నారు. సోమవారం ఉదయం బెంగళూరు నగర శివారుల్లోని ఓ రిసార్ట్ నుంచి తన కొడుకు, అమ్మ మక్కల్ మున్నేట కజగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ సారథ్యంలో ఆమె మద్దతుదారులు 200 వాహనాల కాన్వాయ్‌తో బయలుదేరారు. ఆమె మద్దతుదారులంతా శశికళను పొగడ్తల్లో ముంచెత్తారు. బెంగళూరును వీడటానికి ముందు జయలలిత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జయలలిత మాదిరే గ్రీన్ కలర్ శారీ ధరించారు. అధికార అన్నాడీఎంకే జారీ చేసిన ఆదేశాలను శశికళ, ఆమె మద్దతుదారులు తుంగలో తొక్కేశారు. శశికళ ప్రయాణిస్తున్న బాయ్‌నెట్‌పై పార్టీ పతాకాన్ని ప్రదర్శించారు. పార్టీయేతరులు అన్నాడీఎంకే పార్టీ చిహ్నంతో కూడిన పతాకాన్ని వాడొద్దని తమిళనాడులోని అధికార అన్నాడీఎంకే హెచ్చరించింది కూడా. గత నెల 31వ తేదీన దవాఖాన నుంచి డిశ్చార్జీ అయినప్పుడు శశికళ ప్రయాణించిన కారుపై అన్నాడీఎంకే పతాకాన్ని ప్రదర్శించడంతో అధికార పార్టీలో గుబులు పుట్టినట్లు కనిపిస్తున్నది. అందుకే పార్టీయేతరులు తమ జెండాను వాడొద్దని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు అధికార అన్నాడీఎంకే నేతలు ఫిర్యాదు చేశారు. ఆమె ప్రయాణించిన కారుపై అన్నాడీఎంకే పతాకాన్ని ప్రదర్శించడాన్ని దినకరన్ సమర్థించు కున్నారు. పార్టీ నుంచి బహిష్కరణపై పిటిషన్లు కోర్టులో ఉన్నందున శశికళ పార్టీ సభ్యురాలేనన్నారు. అధిపల్లాయి సరిహద్దుల్లో తనకు స్వాగతం పలికిన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆమె మద్దతుదారులు..అన్నాడీఎంకే, ఏఎంఎంకే పతాకాలు ప్రదర్శించారు. హళసూర్ వరకు శశికళకు స్వాగతం పలుకుతూ ఆర్చీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు.

భూ వివాదాల పరిష్కారంలో నిర్లక్ష్యం

-రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని వైనం

మంచిర్యాల,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): భూసమస్యలు కుప్పలుతెప్పలుగా వెలుగు చూస్తున్నాయి. భూప్రక్షాళన చేపట్టినా 20 శాతం దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మ్యూటేషన్‌ల లోనూ ఫోర్జరీ, ఒకరి భూమి మరొకరి పేరిట, ఒకే భూమి ఇద్దరు, ముగ్గురి పేరిట పట్టాలాంటి అంపణలు ఉన్నాయి. వివాదాలు పరిష్కారం కాని కారణంగా పలువురికి రైతుబంధు పథకం అందడంలేదు. భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు సహనం కోల్పోతున్నారు. మండల కేంద్రాల్లో పరిష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రాలకు వస్తున్నారు. నిరసలు, ఆందోళనలు, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద పదుల సంఖ్యలో రైతులు పురుగుల మందు, కిరోసిన్ వెంట తెచ్చుకోవడం, ప్లెక్సీలు పట్టుకొని ధర్నాలు చేయడం సమస్య తీవ్రతను తెలియ చేసింది. కొందరు రైతులు ప్రతీవారం ప్రజావాణికి వచ్చి దరఖాస్తు చేసుకున్నా సమస్య పరిష్కారం కావడంలేదు. కొన్నిచోట్ల రెవెన్యూ అధికారి సంతకం ఫోర్జరీ చేసి ప్రొసీడింగ్ జారీ చేసి మార్పులు, చేర్పులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు వారి భూ రికార్డుల కోసం సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకోగా అందుబాటులో లేవనే సమాధానం ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఆర్‌వోఆర్‌కు సంబంధించిన ఫైల్స్ మిస్సింగ్‌కు బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించినా ఎవరి పై చర్యలు తీసుకోలేదు. పలు మండలాల్లో నూ ఆన్‌లైన్ పట్టాలలో, పహాణీలలో విచ్చలవిడిగా మార్పులు చేయడం, పలువురి భూములను కబ్జాలు చేయడం, ఒకరి పేరిట ఉన్న భూమిని మరొకరు మార్చుకోవడం, రాజకీయ అండదండలతో ప్రభుత్వ భూములను కబ్జా చేయడం షరామామూలుగా మారింది. ప్రభుత్వం రైతుబంధు ద్వారా సాగుకు సాయం అందిస్తుండడంతో భూమి ఆక్రమణల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు చేసిన తప్పిదాలను ఎత్తిచూపుతున్నారు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు భూ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నియోజకవర్గ అభివృద్ధికి మంత్రుల ప్రత్యేక కృషి

-నిధులు కేటాయిస్తున్నారన్న పుట్టా మధు

పెద్దపల్లి,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): మంథని నియోజవర్గ అభివృద్ధి కోసం మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్‌లు నిధుల కేటాయింపుల విషయంలో సహకారం అందిస్తున్నారని జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గతంలో ఎప్పుడూల ఏనంతగా అనేక కార్యక్రమాలు సాగుతున్నాయని అన్నారు. రాజకీయాల కోసం విమర్శలు చేసే వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రం ప్రభుత్వం తీసుకున్న హరితహారంతో గ్రామాల్లో చక్కటి వాతావారణం ఏర్పడుతోందని అన్నారు. కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం రైతు బంధుకు రూ.14వేల50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రైతు బంధు పథకం కింద ఈఏడాది రెండు పంటలకు కలిపి 61లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.14వేల50 కోట్ల నిధులు జమ చేశామన్నారు. ఆడీఎంఎఫ్ నిధులు కేటాయింపుతోనే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 6 చెక్ డ్యాంల నిర్మాణానికి 110కోట్లు మంజూరు

చేయడంలో ఎంతో కృషి చేశారన్నారు. స్థానికంగా ఉన్న ప్రతిపక్ష నేతలు అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ.. అధికారులను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. 70సంవత్సరాల్లో నియోజకవర్గంలో జరగని అభివృద్ధి టీఆర్ఎస్ హయాంలో జరిగిందన్నా రు. నాటి నేతలు అభివృద్ధి మరిచి ఊరూరా తమ కుటుంబసభ్యుల విగ్రహాలు పెట్టడంపైనే దృష్టి సారించారన్నారు. మానేరునదిపై చెక్‌డ్యాంల నిర్మాణంతో పరివాహక ప్రాంతానికి కళ వచ్చిందన్నారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం

-చెత్తసేకరణను సద్వినియోగం చేయాలి

ఆదిలాబాద్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయిస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని పంచాయితీ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో గ్రామాల్లో సేంద్రియ ఎరువుల తయారీ ఓ ఉద్యమంలా చేపట్టాలన్నారు. గ్రామాల్లో చెత్తను ఉపయోగించి తయారు చేయడంలో సర్పంచ్‌లు ముందుకు రావాలన్నారు. పంచాయతీ సిబ్బంది ప్రభుత్వ అధికారుల ఆదేశానుసారంగా సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరిస్తూ సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయిస్తుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సేంద్రియ ఎరువును రైతులు వాడుకుంటే పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఇదిలావుంటే పల్లెప్రగతిలో భాగంగా గ్రామాల్లో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో

దేవభూమిలో పర్యావరణ ప్రకోపం

(ఉత్తరాఖండ్ ధౌలీగంగా జల ప్రళయానికి స్పందనగా)

దేవభూమిగా పరిగణించబడే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని చమోలీ జిల్లాకు చెందిన రైనీ గ్రామ సమీపాన మంచు చరియలు విరిగిపడి పోటెత్తిన ధౌలీగంగా నది ఆకస్మిక వరదల కారణంగా అపార ప్రాణ మరియు ఆస్తి నష్టాలు జరగడం అత్యంత విచారకరం. ఈ ఊహించని విలయ విషాదంలో 26 మంది ప్రాణాలు కోల్పోగా గల్లంతైన 203 మంది కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సహాయక చర్యల్లో 18 మందిని రక్షించగా గల్లంతైన వారు బ్రతికి ఉండే అవకాశం తక్కువగానే ఉండవచ్చని అంటున్నారు. ఈ ఊహించని విపత్తుకు ప్రధాన కారణం మానవుడి అనాలోచిత కార్యాల ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే అని నిపుణులు అంటున్నారు. చమోలీ జిల్లాలోని ఎత్తైన మంచు పర్వత శ్రేణుల్లో 07 ఫిబ్రవరి ఆదివారం ఉదయం 10:45 గంటలకు జరిగిన భీకర వరదల విపత్తుకు హిమనదీయ సరస్సు పేలడం (గ్లేసియల్ లేక్ బరస్ట్) లేదా హిమపాతం (అవలాంచే) కారణం కావచ్చని అంటున్నారు. మంచు సరస్సుల అంచులు కోతకు గురికావడంతో ఆకస్మికంగా వరదలు సంభవించి నది పరివాహక ప్రాంతాల్లోని ఆవాసాలు, జలవిద్యుత్ కేంద్రాలు, డ్యామ్‌లు, బ్రిడ్జిలు, కొండ చరియలు, మట్టి దిబ్బలు, రాతి శిలలతో కూడి పెను వరదల ప్రమాదానికి దారితీయడం జరిగింది. ఉత్తరాఖండ్ దేవభూమి లోయలు, కొండలు, మంచు కొండలు, దేవాలయాలు, ప్రకృతి అందాలు, నదులతో పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్నది. ఈ ప్రదేశంలో భూకంపాలు సంభవించే అవకాశం కలిగిన ప్రదేశాలుగా ఉంటూ, పర్యావరణపరంగా సున్నతమైన ప్రాంతాలుగా గుర్తించబడింది. పర్యాటకరంగమే ప్రదానంగా జనజీవనం సాగుతున్న ఉత్తరాఖండ్‌లో అనాలోచిత అభివృద్ధిలో భాగంగా హోటళ్లు, వసతిగృహాలు, రోడ్డు వెడల్పు, కొండల అంచుల్లో నిర్మాణాలు లాంటి ప్రమాదకర నిర్మాణాలు పెరగడంతో ఇలాంటి విధ్వంసకర విపత్తులు జరుగుతున్నాయని తెలుస్తున్నది.

ఉత్తరాఖండ్ భూభాగంలో 1999లో జరిగిన భూకంపంలో 100కు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. జోషిమట్ ప్రాంతంలో 2004లో కొండ చరియలు విరిగిపడి 16 మంది, 2005లో చమోలీలో జరిగిన విపత్తు ప్రమాదంలో 11 మంది మరణించారు. 2013లో జల ఉప్పెనతో కేదార్‌నాథ్ ప్రాంతంతో పాటు చమోలీ, భాగేశ్వర్, పితోరఘర్, రుద్రప్రయాగ, ఉత్తరకాశీల్లో అపార ప్రాణ ఆస్తి నష్టం జరిగింది. నందాదేవి హిమనీయ సరస్సుల అంతర్భాగంలో మంచు పొరల కింది భాగాన నీరు ఉంటుందని, ఆకస్మికంగా పీడనం పెరగడంతో హిమనదీయ సరస్సు పేలడంతో జల విపత్తు జరిగిందని విశ్లేషిస్తున్నారు. భూతాపం, అనాలోచిత అభివృద్ధి మరియు అసాధారణ వాతావరణ మార్పులతో హిమాలయన్-హిందూకుష్ పర్వత ప్రాంతాలు భవిష్యత్తులో ప్రమాదకర జోన్‌లుగా మారనున్నాయని అంటున్నారు. గత 4 దశాబ్దాలుగా సాటలైట్ దృశ్యాలు పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం 2019లో పలు హెచ్చరికలు చేశారు. హిమాలయ ప్రాంత ఇండియా, చైనా, నేపాల్ మరియు భూటాన్‌లలో కేదార్‌నాథ్‌లో జరిగిన దుర్ఘటనల లాంటి మరి కొన్ని దుర్ఘటనలు జరిగే ప్రమాదం ఉందని నిర్ధారణ చేశారు. భూతాపంతో ఉష్ణోగ్రతలు పెరుగుతూ హిమనీ నదాలు క్రమంగా కరుగుతున్నాయని నాసా విశ్లేషణలో బయట పడింది. ఉత్తరాఖండ్ ప్రాంతంలో హిమనీనదాల సంఖ్య క్రమంగా పెరుతున్నదని, వీటితో భవిష్యత్తులో ఇలాంటి జల ప్రళయాలు తరుచుగా జరుగే అవకాశం కూడా ఉందని తేల్చారు. విపత్తు జరిగిన రోజున వాతావరణ శాఖ ఎలాంటి అసాధారణ వాతావరణ హెచ్చరికలు చేయలేదని, సాధారణ రోజంతా ఎండలతో వాతావరణం నిర్మూలంగా ఉంటుందని ప్రకటించారు.

వాతావరణపరంగా అతిసున్నితమైన హిమాలయన్ ప్రాంతాల నిర్వహణలో ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకోవలసి ఉంటుంది. అభివృద్ధి పేరుతో ప్రకృతి వినాశనాన్ని కఠిన నిబంధనలలో నిలిపి వేయాలి. ఈ లోయల ప్రాంతాల్లో భారీ డ్యామ్‌ల మరియు జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణాలను చేపట్టే ముందు నిపుణుల సూచనలను విధిగా పాటించాలి. భారీ డ్యామ్‌లకు బదులుగా స్విట్జర్‌లాండ్ నమూనాతో చిన్న డ్యామ్‌లను ఎక్కువ సంఖ్యలో నిర్మించుట వలన విపత్తు నష్టాలు తగ్గి పోవడమే కాకుండా ఉద్యోగఉపాధులు పెరుగుతాయని గమనించాలి. స్వార్థపరుల ప్రకృతి విచ్ఛిన్నకర దోపిడీలను అరికట్టేందుకు సరైన చట్టాలు చేస్తూ, వాటి అమలులో శ్రద్ధ వహించాలి. గత విషాదకర ఘటనలను గుణపాఠాలుగా మరియు తీవ్ర హెచ్చరికలుగా భావించి ప్రమాదాల కట్టడికి మరియు నష్ట నివారణకు చర్యలు చేపట్టాలి. పర్యావరణానికి చేటు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని, వాతావరణం మరియు ఆర్థికాభివృద్ధి సమాంతరంగా సాగాలని ఆశించాలి. ప్రభుత్వాలు, సంస్థలు, పౌరసమాజం ఐకమత్యంతో పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులై ప్రకృతి విపత్తులను నివారిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించాలని కోరుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రైతుల సంక్షేమమే కెసిఆర్ లక్ష్యం

అన్నదాతలను సంఘటితం చేస్తున్నాం
భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు

వరంగల్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): రైతును రాజును చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మంత్రులు అన్నారు. రాష్ట్రమంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి వరంగల్ పట్టణంలోని భద్రకాళి అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులకు ఆలయ ఈఓ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం మంత్రులకు ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అన్నదాతలను సంఘటిత పరిచి.. వారికి కావాల్సిన సదుపాయాలు, మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. అందుకే సాగునీరు, విత్తనాలు, 24 గంటల విద్యుత్, రైతు వేదికలు, కల్లాలు, అనేక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. సరైన పంటల ప్రణాళిక, పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. ప్రతి ఏటా రూ.400 కోట్లు రైతాంగ సంక్షేమానికి ఇచ్చేందుకు సీఎం ఆలోచిస్తున్నారన్నారు. కష్టకాలంలో రైతుల పంటలను కొనుగోలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టాలు రైతులకు నష్టం కలిగించేలా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ వచ్చాకనే వ్యవసాయరంగంలో మార్పులు

రైతులకు అండగా సిఎం కెసిఆర్ కార్యక్రమాలు
12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన ఘనత రైతులదే
అలీనగర్ సిఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

నల్లగొండ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగంలో తెచ్చిన మార్పులతో అత్యంత ఎక్కువ లాభం పొందింది ఉమ్మడి నల్లగొండ జిల్లానే అని మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. 2014లో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తే.. ప్రస్తుతం 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రికార్డు సృష్టించిందన్నారు. నల్గొండ జిల్లా అనుముల మండలం అలీనగర్ సమీపంలో బుధవారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి ధన్యవాద సభకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో నాగార్జున సాగర్ కాలువ డిజైన్‌లో లోపాలతో కృష్ణా నది ఒడ్డున ఉన్న పొలాలకు నీరంద లేదన్నారు. చివరి భూముల పేరుతో 55 ఏండ్లు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అన్యాయం చేశాయని మండిపడ్డారు. ప్రతి ఇంచు భూమికి నీరు అందించాలనే లక్ష్యంతో 60 వేల ఎకరాలకు సాగునీరందించే 13 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సీఎం కేసీఆర్ బుధవారం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపేందుకు ఉమ్మడి జిల్లా రైతాంగం ఎదురుచూస్తోందని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల సంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని రైతాంగం ఆధైర్యపడాల్సిన అవరసరం లేదని, రైతులకు అన్ని విధాలుగా అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతుధర వచ్చేలా, సకాలంలో రైతులు ధాన్యం డబ్బులు ఇప్పించే బాధ్యత మార్కెట్ కమిటీలే తీసుకోవాలన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధితో పాటు వారిని సంఘటితం చేయడానికి రైతువేదికల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గతంలో రైతులు సాగునీరు, విద్యుత్ కోసం ఉద్యమాలు చేయడంతోపాటు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలున్నాయన్నారు. రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై కేంద్రం దృష్టి సారించాలని విజ్ఞప్తిచేస్తున్నామనారు. దేశంలోనే తెలంగాణ రైతులను గొప్పగా చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల అభివృద్ధి, రైతుబంధు, 24 గంటల కరెంట్, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. పర్యావరణ అభివృద్ధి కోసం హరితహారం, చెట్ల సంరక్షణ, ప్రతిగ్రామంలో నర్సరీలు, ఫ్లలెప్రగతిలో గ్రామాల అభివృద్ధి, రైతువేదికలు, వైకుంఠధామాల నిర్మాణాలు చేపడుతోందన్నారు.

కెసిఆర్ ఉన్నంత వరకు మరో పార్టీకి ఛాన్స్ లేదు

రాయలసీమ ఫ్యాక్షన్ ఇక్కడ నడవదు
షర్మిల పార్టీపై స్పందించిన మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): కెసిఆర్ ఉన్నంత వరకు తెలంగాణలో మరో పార్టీకి లేదా మరో వ్యక్తికి అవకాశం లేదని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ అంటేనే కెసిఆర్ అని అన్నారు. తెలంగాణలో వైఎస్ షర్మిల కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నారన్న వార్తల నేపథ్యంలో రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. తెలంగాణలో వేరే పార్టీకి పుట్టగతులు ఉండవని వ్యాఖ్యానించారు. ఇక్కడ టీఆర్ఎస్ తప్ప మరో పార్టీకి అవకాశమే లేదని, వేరే పార్టీలు రావని.. వచ్చినా బతకవని కుండబద్దలు కొట్టారు. ఫ్యాక్షన్ రాజకీయాలు ఇక్కడ నడవవన్నారు. టీఆర్ఎస్‌లో ధిక్కార స్వరమే లేదని, బయట వస్తున్న వార్తలు కరెక్ట్ కాదన్నారు. ఇకపోతే వెనుకబడిన కులాలను మోసం చేస్తున్నది భారతీయ జనతా పార్టీనే అని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బండి సంజయ్‌కు బీసీలపై ప్రేమ ఉంటే.. కేంద్రంలో తక్షణమే బీసీ సంక్షేమ శాఖను ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని తెలిపారు. కోకాపేటలో బీసీల కోసం ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామని చెప్పారు. మిగతా అన్ని చోట్ల మార్చి నెలలో ఆత్మగౌరవ భవనాల నిర్మాణం ప్రారంభమవుతుందని మంత్రి పేర్కొన్నారు. 17 ఉపకులాలను బీసీల్లో చేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని తెలిపారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కోసం రూ. 9 వేల కోట్లు ఇచ్చామన్నారు. కాలేజీలు, స్కూళ్లల్లో ఈ నాలుగు నెలలకు మాత్రమే ఫీజులు వసూలు చేసేలా నిబంధనలు జారీ చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొన్న బైక్..వ్యక్తి మృతి

ఖమ్మం,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): జిల్లాలోని పెనుబల్లి మండలం ఎడ్ల బంజర గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. భువనపాలెం గ్రామానికి చెందిన కేశవరావు(23) బైక్‌పై వేగంగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పిన ఆ బైక్.. ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కేశవరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెక్కులతో పాటు కొత్త బట్టలు

– ఎమ్మెల్యే సండ్ర పంపిణీ

ఖమ్మం,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వినూత్న కార్యక్రమం చేపట్టారు. పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మీ చెక్కులతో పాటు నూతన వస్త్రాలను అందించారు. కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే నేరుగా లబ్దిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. పెనుబల్లి మండలం ఎరుగాట్ల గ్రామంలో కొత్తపల్లి వెంకట, మారగాని నాగమ్మకు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే వారికి అందించారు. చెక్కులతో పాటు సొంత ఖర్చులతో నూతన వధువులకు నూతన వస్త్రాలు బహుకరించారు.

వృద్ధుని కుటుంబానికి అండగా ఉంటాం-కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9 : (నేటినిజం ప్రతినిధి): కోనరావుపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుమృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కోనరావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషాఅన్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామం చాంద్ నగర్ కు చెందిన షేక్ మొహమ్మద్ సాహెబ్ కు సుమారు రెండు సంవత్సరాల అనారోగ్యంతో మంచానపడి కనీసం తినడానికి తిండిలేక అలమటిస్తున్నారు ఈ క్రమంలో వృద్ధాప్య పెన్షన్ ఆగిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వృద్ధుని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా వారి కుటుంబానికి మంగళవారం పరామర్శించి నిత్యవసర సరుకులు అందజేశారు . ఈ సందర్భంగా ఫిరోజ్ పాషా మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల వృద్ధులకు రావలసిన పెన్షన్ గత రెండు సంవత్సరాల క్రితం నుండి ఆగిపోవడంతో మరియు వారు అనారోగ్యానికి గురై మంచాన పడడంతో నా అనే నాధుడే లేకుండా పోయిందని తమ సొంత పనులు తాము చేసుకోలేని పరిస్థితుల్లో వారు ఉన్నారని కనీసం మానవతా దృక్పథంతో కూడా అధికారులు వ్యవహరించడం లేదని ఎన్నిసార్లు వారి చుట్టూ తిరిగినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని మానవతా దృక్పథంతో ఇప్పటికైనా అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్కల దేవి అని, పుల్లూరు గణేష్, బొడ్డు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకుంటాం

–ఎమ్మెల్యే రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9 : (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండల ఈనాడు విలేఖరి ఆకస్మిక మరణం పత్రికా రంగానికి తీరని లోటని, జర్నలిస్టు మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు అన్నారు, చందుర్తి ఈనాడు విలేఖరి ఆయాచి తుల శిరీష మంగళవారం గుండెపోటుతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు, జర్మనీ నుండి ఫోన్ చేసి సంతాపం ప్రకటించారు,చందుర్తి ఈనాడు విలేకరిగా శిరీష ఏడు సంవత్సరాలు సేవలందించి ప్రభుత్వానికి సంబంధించిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసిందన్నారు, శిరీష భర్త శ్రీనివాస్ కూడా ఈనాడు విలేకరిగా పనిచేసి ఎన్నో కథనాలు రాసి ప్రజల మన్ననలు పొందాడాని గుర్తు చేశారు,శిరీష చిన్నారి కుమారులను ప్రభుత్వ పరంగా చేరదీసి ఆదుకుంట ామన్నారు, జర్నలిస్టు సంక్షేమ నిధి నుండి ఆర్థిక సాయం అందే విధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తో మాట్లాడు తమన్నారు, తల్లిదండ్రులు ఇద్దరిని కోల్పోయిన అనాధలైన చిన్నారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు,

మహాశివరాత్రి జాతర విజయవంతంగా నిర్వహిస్తాం-డిఎస్పీ చంద్రకాంత్...

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9 : (నేటినిజం ప్రతినిధి):రాజన్న ఆలయంలో మార్చి 10 నుండి మార్చి 12 వరకు జరిగే మహాశివరాత్రి జాతర కు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్షేమంగా వెళ్లుటకు అన్ని భద్రతా చర్యలను తీసుకొనుటకు గాను స్థానిక డి ఎస్పీ చంద్రకాంత్ అధ్యక్షత న ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ యందు ఈ రోజు ఫైర్ డిపార్ట్మెంట్,పోలీస్, రెవిన్యూ, మునిసిపల్ ,ఆలయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రకాంత్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన ఏర్పాటు చేయాలని కోరారు.అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తామని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఫైర్ అధికారి వెంకన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఈ రాజేష్,ఏ ఈ ఓ సంకేపల్లి హరికిషన్ ,కరీంనగర్ ఉమ్మడిజిల్లా ఫైర్ అధికారి తగరం వెంకన్న ,మునిసిపల్ కమిషనర్ ,ఎంఆర్ ఓ తో పాటుగా ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు

కౌంటర్ దాఖలు చేయని టిడిపి నేతలు

–సుప్రీం ధర్మాసనం ఆగ్రహం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): అమరావతి భూ కుంభకోణంపై సిట్ ఏర్పాటు, మాజీ ఏజీ దమ్మాలపాటి కేసుపై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ జరిపింది. నోటీసులకు టీడీపీ నేతలు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే ఆఖరి అవకాశమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లేదంటే తాము ప్రొసీడ్ అవుతామని హెచ్చరించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని టీడీపీ నేతలు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రలను సుప్రీంకోర్టు ఆదేశించింది. రీ జాయిండర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. మార్చి 5న తుది విచారణ చేస్తామని ధర్మాసనం వెల్లడించింది.కాగా, అమరావతి భూ కుంభకోణంపై ంధ్రప్రదేశ్ కేబినెట్ సబ్ కమిటీ పరిశీలన మేరకు ఏర్పాటైన సిట్ దర్యాప్తును నిలిపివేయాలంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేయగా దర్యాప్తుపై హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది

చందుర్తిలో విషాదం- గుండెపోటుతో ఈనాడు విలేకరి మృతి

–అంత్యక్రియల్లో హాజరైన జర్నలిస్టులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9 : (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండల ఈనాడు పాత్రికేయురాలు ఆయాచితుల శిరీష గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది, శిరీష గత 15 రోజుల నుండి గుండె నొప్పితో బాధపడుతూ కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతో తల్లి ఇంటి వద్ద కాల్వ శ్రీరాంపూర్ మండలం లో విశ్రాంతి తీసుకుంటుడగా మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల 30 నిమిషాలకు గుండెనొప్పితో చనిపోయినట్లు శిరీష కుటుంబ సభ్యులు తెలిపారు, గత ఏడు సంవత్సరాలుగా శిరీష ఈనాడు దినపత్రికలో విలేకరి గా పనిచేస్తుంది, శిరీష భర్త శ్రీనివాస కూడా ఈనాడు పత్రికలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు, శ్రీనివాస స్థానంలో శిరీష విలేకరి గా పని చేస్తున్న తరుణంలో గుండెపోటుతో మృతి చెందడం పాత్రికేయ రంగం తో పాటు మండల ప్రజలను కలిచివేసింది, మృతురాలు శిరీష కు ఇద్దరు చిన్నారులు కుమారులు ఉన్నారు, శిరీష అంత్యక్రియల్లో జెడ్పిటిసి నాగం కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్,బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ,సెస్ డైరెక్టర్ అల్లాడి రమేష్, సర్పంచులు చిలుక బాబు, లక్ష్మీనారాయణ, లింగంపల్లి సత్తయ్య, ఎంపీటీసీలు మ్యాకల గణేష్, పులి రేణుక సత్యం, మాదాసు వేణు, నాయకులు పిట్టల భూమేష్, మ్యాకల ఎల్లయ్య, దప్పుల అశోక్, మర్రిమల్లేశం, గొట్టే ప్రభాకర్,ఎస్సై సునీల్, ఎంపీడీవో రవీందర్, ఉపాధిహామీ ఎపిఓ అరుణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ సంఘం నాయకులు హింగే శ్రీనివాస్, ఎం.ఏమన్నాన్ దాసరి దేవేందర్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఎండి అజ్జు, చందు, రాజు, కిరణ్, వెంకటేష్, మహేష్ తో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు,

సివిల్ సమస్యలను కోర్టు పరిష్కరించుకోవాలి -జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9 : (నేటినిజం ప్రతినిధి):సివిల్ సమస్యలను కోర్టు లోని పరిష్కరించుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు ప్రజదివాస్ కార్యక్రమాన్ని . మంగళవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్ లో 08 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఫిర్యాదులు పెండింగ్ పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఎస్. హెచ్. ఒ లను ఆదేశించినట్లు చెప్పారు. సివిల్ సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు.భూమిని నమోదు చేయమని లేదా పౌర వివాదాలకు పాల్పడాలని మరియు పరిష్కారాలు చేయమని పౌరులను ఎవరైనా బెదిరిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాము మరియు ఇలాంటి సంఘటనలకు సంబంధించి ప్రజలు మా కార్యాలయానికి వచ్చి పిర్యాదు చేయవచ్చు..

'సివిల్ తగాధల్లో ఏ అధికారి కూడా తలదూర్చకిడదని ఏ అధికారి ఐన సివిల్ తగాధల్లో ఇబ్బందికి గురిచేస్తే నేరు గా జిల్లా పోలీస్ కార్యాలయంలో పిర్యాదు చేయవచ్చు అని జిల్లా ఎస్పీ చెప్పారు'

యుద్ధ ప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్: లోక్‌సభలో అమిత్ షా

న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 : ఉత్తరాఖండ్‌లో జలప్రళయం కారణంగా చమోలీ జిల్లాలోని నేషనల్ థర్మల్ పవర్ కంపెనీకి చెందిన సొరంగాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఈ మేరకు ఆయన ఉత్తరాఖండ్ జల విపత్తుపై లోక్‌సభలో ప్రకటన చేశారు. ఈ సహాయక బృందాలు ఎన్‌టీపీసీకి చెందిన మొదటి టన్నెల్ నుంచి 12 మంది కార్మికులను వెలికితీశాయని షా చెప్పారు. రెండో టన్నెల్‌లో కూడా 25-35 మంది ఉన్నట్లు తెలుస్తోందని, వారిని సురక్షితంగా బయటికి తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నదని తెలిపారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పథకాలను అర్హులందరూ ఉపయోగించుకోవాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 9: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పథకాలను అర్హులైన బ్రాహ్మణులు అందరూ ఉపయోగించుకోవాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ డా. కె వి రమణాచారి అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామానికి చెందిన కొండపాక రంగాచార్యకు స్వయం ఉపాధిలో భాగంగా హోండా అమేజ్ కారును రమణాచారి మంగళవారం అందజేశారు. నగరంలోని బొగ్గులకుంట, తిలక్ రోడ్, ఎండోమెంట్ ఆఫీస్ నందు జరిగిన ఈ కార్యక్రమంలో రమణాచారి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్య